క్లుప్తంగా

గొడుగులు పంపిణీ



గొడుగులు పంపిణీ చేస్తున్న మల్లు సూర్య విక్రమాదిత్య

మధిర: వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని వీధి వ్యాపారులకు ఇబ్బంది లేకుండా డిప్యూటీ సీఎం, ఆర్థిక ప్రణాళిక విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క సహకారంతో గొడుగులు పంపిణీ చేశారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే భట్టి క్యాంప్ కార్యాలయంలో ఆయన తనయుడు మల్లు సూర్య విక్రమాదిత్య చేతుల మీదగా వీధి వ్యాపారులకు గొడుగులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ కోనా ధనికుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, నాయకులు దుంపా వెంకటేశ్వరరెడ్డి, పారుపల్లి విజయ్ కుమార్, యన్నం కోటేశ్వరరావు, టీవీ రెడ్డి, కర్నాటి రామారావు, కోట డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రాఫ్ట్ మేళా



కళాకృతులను ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు

వైరా: వైరాలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో సోమవారం క్రాఫ్ట్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలు తయారు చేసిన లోకాస్ట్, నోకాస్ట్ మెటీరియల్‌తో తయారు చేసిన అద్భుతమైన కళా ఖండాలు ఆకట్టుకున్నాయి. క్రాఫ్ట్ టీచర్ ప్రేమలీల ఆధ్వర్యంలో బాలికలు పలు ఆకృతులను సందర్శకులు ఆసక్తిగా తిలకించారు. ప్రధానోపాధ్యాయురాలు మల్లేశ్వరి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

పల్స్ పోలియోపై కళాజాత



అవగాహన కల్పిస్తున్న లంకా కొండయ్య

మధిరరూరల్: దెందుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పృథ్వీరాజ్ నాయక్ ఆధ్వర్యంలో పారా మెడికల్ సిబ్బంది మార్చి 3న జరగబోయే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ కళాజాత నిర్వహించారు. ఖమ్మంపాడు దళిత కాలనీలో సోమవారం ప్రముఖ జానపద కళాకారుడు, ఆరోగ్య పర్యవేక్షకుడు లంకా కొండయ్య మాట్లాడుతూ.. అప్పుడే పుట్టిన బిడ్డ మొదలుకొని 5 సంవత్సరాలలోపు పిల్లలకు తప్పనిసరిగా నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు వేయించాలని కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది గోవింద్, కౌసల్య, భారతి, నాగమణి, అంగన్వాడీ టీచర్ మువ్వా పద్మావతి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మతతత్వ పార్టీలతో అప్రమత్తంగా ఉండండి

సత్తుపల్లిటౌన్: దేశంలో క్రిస్టియన్లు, ముస్లీంలపై దాడులు చేసే మతతత్వ పార్టీల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు అలవాల కరుణాకర్ అన్నారు. సోమవారం సత్తుపల్లిలోని ఎన్టీఆర్ నగర్ క్రీస్తు సంఘం ప్రార్ధనా మందిరంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అన్ని వర్గాల ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో ఎన్సీసీ రాష్ట్ర పొలిటికల్‌వింగ్ అధ్యక్షుడు పింగళి సామేలు, కనకపుడి నాగార్జున, యాకోబు, ప్రసాద్, కొత్తపల్లి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సేవాసదనంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న స్వర్ణలత

మధిర: మధిర పట్టణంలోని మదర్ థెరిస్సా మానసిక దివ్యాంగుల సేవాసదనంలో సోమవారం లగడపాటి దీప్తి పుట్టినరోజు సందర్భంగా అన్నదానం చేశారు. ఈ సందర్భంగా సేవాసదనం నిర్వాహకురాలు స్వర్ణలత మాట్లాడుతూ.. దాతల సహకారంతో సేవాసదనం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మానసిక దివ్యాంగుల పట్ల ప్రేమ, జాలి కలిగి ఉండాలని కోరారు.

మోక్షమెప్పుడో ?



అసంపూర్తిగా నిలిచిపోయిన అంగన్‌వాడీ భవనం

అసంపూర్తిగా అంగన్‌వాడీ భవనం

- మరమ్మతులకు నోచుకోక తొమ్మిదేళ్లు
- అద్దె గృహాల్లో పిల్లలకు పాఠాలు
- ఆందోళనలో గ్రామస్తులు

కల్లూరురూరల్: మండలంలోని పుల్లయ్య బంజరులో 2015వ సంవత్సరంలో రూ.8 లక్షల వ్యయంతో నిర్మాణ పనులు ప్రారంభించిన అంగన్‌వాడీ భవనం 9 సంవత్సరాలు గడిచినప్పటికీ నేటికీ అసంపూర్తిగా నిలిచిపోయింది. ఏళ్ల తరబడి ఈ భవనాన్ని ఎటువంటి మరమ్మతులు చేపట్టకుండా అసంపూర్తిగా వదిలేయడంతో గోడలు బీటలు బారాయి. ఈ భవనం గదుల్లో పందికొక్కులు దూరి కన్నాలు పెట్టడమే కాకుండా.. పాములు, ఇతర విష పురుగులు చేరేందుకు అవాసంగా ఏర్పడింది.

ఆందోళనలో గ్రామస్తులు..

ఈ అంగన్‌వాడీ భవనానికి శ్లాబు వేసి, గోడలు నిర్మించి, కిటికీలు, తలుపులు బిగించకుండా గోడలకు ప్లాస్టింగ్ చేయించకుండా అసంపూర్తిగా వదిలేయడంతో ఈ భవనం పాడైపోతుందని గ్రామస్తులు కిష్టంశెట్టి నర్సింహారావు, బుర్రి వీరయ్య, మాడిశెట్టి శ్రీను, రంగు లక్ష్మణరావు, బుర్రి నర్సింహారావు, కృష్ణయ్య, పెద్దబోయిన వెంకటేశ్వరరావులు ఆందోళన వ్యక్తం చేశారు.

తొమ్మిదేళ్లగా నిరుపయోగం..

గత తొమ్మిది సంవత్సరాలుగా నిధులు లేక నిలిచిపోయిన ఈ భవనాన్ని మరమ్మతులు చేయడానికి సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోక పోవడం శోచనీయమన్నారు.

ఈ విషయమై పంచాయతీరాజ్ ఏఈ వెంకటేశ్వరరావును వివరణగా కోరగా పుల్లయ్య బంజరు అంగన్‌వాడీ కేంద్రం మరమ్మతులకై ఎంపీపీ నిధుల నుంచి రూ.4.50 లక్షలు కావాలని కోరుతూ ప్రతిపాదనలు చేశామని, మరో లక్ష రూపాయలు పూర్తిస్థాయిలో మరమ్మతులకు ప్రతిపాదన సిద్ధం చేశామని తెలిపారు. నిధులు మంజూరు కాగానే పూర్తి స్థాయిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని మరమ్మతులు చేస్తామని తెలిపారు.

పూర్తి చేయాలి..



తొమ్మిదేళ్ల క్రితం ప్రారంభించిన అంగన్‌వాడీ భవనం నేటికీ పూర్తి కాకపోవటం శోచనీయం. నిధుల విడుదల విషయంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే భవనాన్ని అసంపూర్తిగా వదిలేశారు. దీంతో అంగన్‌వాడీ కేంద్రానికి భవనం లేక అద్దె గృహాల్లో కొనసాగిస్తున్నారు. ఇకనైనా సంబందింత అధికారులు పిల్లల సౌకర్యార్థం నిధులు కేటాయించి మరమ్మతులు చేపట్టాలి.

– రంగు లక్ష్మణరావు, పుల్లయ్యబంజరు

మరో భవనం నిర్మించాలి..



ఈ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో.. దీని బదులుగా మరోచట కొత్త అంగన్‌వాడీ భవనాన్ని నిర్మించాలి. పాత భవనానికి మరమ్మతులు చేసినా ఉపయోగం ఉండదు. పంచాయతీ స్థలంలో నిర్మించినట్లైతే అందరికీ ఉపయోగకరంగా ఉటుంది. ఈ విషయమై ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దృష్టికి తీసుకెళ్లాం.

– బుర్రి వీరయ్య, పుల్లయ్య బంజరు

విద్యార్థులు చదువులో రాణించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ ప్రభాకర్‌రావు

ఎర్రుపాలెం: విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నతమైన స్థానాలను చేరుకోవాలని, ఆ మేరకు ఇప్పటి నుంచే కష్టపడాలని ఎంఈఓ వై.ప్రభాకర్‌రావు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రమణారెడ్డిలు సూచించారు. సోమవారం మండలంలోని బనిగండ్లపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం చల్లా రంగారెడ్డి అధ్యక్షతన జరిగిన ఫేర్‌వెల్ వేడుకల సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరై వారు మాట్లాడారు. చదువుల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు. పదిలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. మాజీ సర్పంచ్ జంగా పుల్లారెడ్డిని సన్మానించారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ శీలం అక్కిరెడ్డి, మాజీ చైర్మన్ యన్నం సత్యానారాయణరెడ్డి, నాయకులు యన్నం పిచ్చిరెడ్డి, వేమిరెడ్డి వెంకటరెడ్డి, వేమిరెడ్డి రామిరెడ్డి, జవ్వాజి భాస్కర్‌రావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నీలాద్రీశ్వర ఉత్సవాల పోస్టర్లు ఆవిష్కరణ

పెనుబల్లి: మండలంలోని నీలాద్రీశ్వరాలయ మహాశివరాత్రి వేడుకల పోస్టర్లను జిల్లా కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్ సోమవారం ఆవిష్కరించారు. నీలాద్రీశ్వరాలయ ఆవరణలో మార్చి 8న నిర్వహించనున్న మహాశివరాత్రి వేడుకల నిర్వహణపై సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళా భక్తులకు ఇబ్బంది లేకుండా స్నానాల టాయిలెట్స్, షవర్లు ఏర్పాటు చేయాలని, భక్తులందరికీ దర్శనం కలిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా శివరాత్రి వేడుకల పోస్టర్లను స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ పాకాల వెంకటరమణ, సత్తుపల్లి రూరల్ సీఐ ఎస్.వెంకటేష్, ఎస్సై వెంకటేష్, ఆలయ కమిటీ చైర్మన్ చీకటి చిన్న నరసింహారావు, స్థానిక నాయకులు కోటేశ్వరరావు, కరీముల్లా, కమలాకర్‌రావు, నరసింహారెడ్డి, రామారావు, చిన్నస్వామి, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శివరాత్రి వేడుకల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మట్టా దయానంద్, తదితరులు

ఆదర్శజీవి తుమ్మలపల్లి శాంతమ్మ

కారేపల్లి: సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నేత తుమ్మలపల్లి అప్పయ్య సహధర్మచారిణి తుమ్మలపల్లి శాంతమ్మ ఆదర్శజీవి అని ప్రముఖ కవి జయరాజ్, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు రాయల చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్యలు అన్నారు. కారేపల్లి మండలం మాధారంలో సోమవారం తుమ్మలపల్లి శాంతమ్మ సంస్మరణ సభ జరిగింది. శాంతమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కవి జయరాజ్ అమరులను కీర్తిస్తూ పాటలు పాడారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. తుమ్మలపల్లి అప్పయ్య తాను నమ్మిన సిద్ధాంతం కోసం కుటుంబానికి మార్గనిర్దేశం చేసి అదే మార్గంలో నడిపించారన్నారు. అప్పయ్య అమరుడైనా జీవిత భాగస్వామి శాంతమ్మ తన కుమారులను కమ్యునిస్టులకు మార్చారన్నారు. ఉద్యమంలో పెద్దకుమారుడు తుమ్మలపల్లి అనంతరావు అమరుడైనాడని, చిన్న కుమారుడు తుమ్మలపల్లి ప్రసాద్ సామాజిక కార్యక్రమాలు నిర్వహించటం వంటి ఆదర్శభావాలతో నిలవటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వర్లు, సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ నాయకులు చంద్ర అరుణ, గుగులోతు తేజా, ఎస్‌వీ రాకేష్, సక్రు, సత్తిరెడ్డి, రావుల నాగయ్య, కాంగ్రెస్ నాయకులు పులగండ్ల మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడు అప్పయ్య మృతి



వెంకటప్పయ్య (ఫైల్)

కొణిజర్ల: మండలంలోని పెద్దగోపతికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు యల్నాటి వెంకటప్పయ్య(95) సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతి పట్ల సీపీఐ జాతీయ సమితి సభ్యుడు మాజీ ఎమ్మెల్యే పువ్వాడ నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు కోటేశ్వరరావు, చంద్రావతి, మాజీ ఎమ్మెల్సీ నాగేశ్వరరావు, టీడీపీ ఖమ్మం పార్లమెంట్ అధ్యక్షుడు రామనాథం, డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, టీడీపీ మండలాధ్యక్షుడు సుధాకర్‌రావు, ఎంపీపీ మధు, ఆప్ జిల్లా అధ్యక్షుడు స్వర్ణ సుబ్బారావు, కాంగ్రెస్, సీపీఎం నాయకులు తదితరులు నివాళులు అర్పించారు.

ధ్వంసమైన బీటీ రోడ్డు





ఖానాపురం-గన్నవరం గ్రామాల మధ్య ధ్వంసమైన బీటీ రోడ్డు

వైరారూరల్: మండలంలోని ఖానాపురం-గన్నవరం గ్రామాల మధ్యలో ఆర్‌అండ్‌బీ పరిధిలోని బీటీ రోడ్డు పలుచోట్ల ధ్వంసమైంది. నిత్యం ఇటుగా భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్న నేపథ్యాన బీటీ రోడ్డు పలుచోట్ల కుంగి పూర్తిగా ధ్వంసమైంది. ఆంధ్రాలోని ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలంలోని నెమలి, ఊటుకూరు, కొణిజర్ల తదితర గ్రామాలకు ఇదే ప్రధాన మార్గం కావడంతో నిత్యం ఇటుగా వందలాది రాకపోకలు సాగిస్తుంటాయి. కాగా ఆయా గ్రామాల మధ్య బీటీ రోడ్డు ధ్వంసం కావడంతో ప్రయాణికులను తీసుకెళ్లే ఆటోవాలాలు, ద్విచక్రవాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కావున ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం జరగకముందే సంబంధిత శాఖాధికారులు రోడ్లకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

విశ్వధర్మక్షేత్రంలో నాగసాధువుల పూజలు

సత్తుపల్లిరూరల్: శ్రీవిశ్వధర్మక్షేత్రం ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా మండలంలోని బుగ్గపాడు గ్రామంలో ప్రముఖ ఆగమ వాస్తు జ్యోతిష్య సిద్ధాంతి వెల్లటూరి ప్రసాదాచారి ఆధ్వర్యంలో సోమవారం నాగ సాధువులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోపూజ, యంత్రానుష్టానములు, సూక్త హోమం, రుద్ర హోమం, అన్నపూర్ణేరి హోమం, దుర్గా హోమం, క్షీరాధివాసము, నవనీతాదివాసం పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వేదపండితులు తియ్యబిండి కల్యాణ్‌కుమార్ ఆచార్యులు, అత్తలూరి బాలశంకర్ శాస్త్రి, గోసుగుంట నాగేశ్వరశర్మ, తుమ్మూరి శ్రీరాం ప్రసాద్, ప్రసాద్‌స్వామి పాల్గొన్నారు.

సాయినాధుడికి ..

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెంలో సాయిబాబా 16వ ఆలయ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో మంగళతోరణం కట్టి, బాబాకి అభిషేక పూజలు నిర్వహించారు. మహిళలు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అఖండ సాయినామం, పల్లకి సేవ, సాయినాధుని ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో సాయిబాబా ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

రక్త పరీక్షలు చేయించుకోవాలి

ఏన్కూరు: జ్వరం వచ్చి వెంటనే తగ్గకపోతే ఆరోగ్యకేంద్రానికి వచ్చి రక్త పరీక్షలు చేయించుకోవాలని ప్రభుత్వ వైద్యాధికారి బి.రాములు కోరారు. మండలంలోని ఎర్రబోడుతండలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వరం సాకి కీళ్లనొప్పులతో బాధపడుతున్న వ్యక్తులకు రక్త పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎర్రుపాలెం: మండలంలోని ములుగుమాడు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా మంగళవారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని మామునూరు సెక్షన్ విద్యుత్ ఏఈఈ ఆర్ శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని సఖినవీడు, తక్కెళ్లపాడు, ములుగుమాడు గ్రామాల్లో అంతరాయం కలుగుతుందని.. కావున వినియోగదారులు సహకరించాలని కోరారు.

టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థి ప్రతిభ

ముదిగొండ: ఎస్‌ఎఫ్‌ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన మండల స్థాయి ఎస్‌ఎఫ్‌ఐ టాలెంట్ టెస్ట్ ఏర్పాటు చేశారు. ఈ నెల 27న జరిగే జిల్లాస్థాయిలో జరిగే టాలెంట్ టెస్ట్‌కు మండలంలోని కమలాపురం సాయి మెరిట్ హైస్కూల్‌లో పదో తరగతి చదివే విద్యార్థి గుండు చందు ప్రతిభ కనబరిచడంతో ఎంపికైనట్లు సాయిమెరిట్ హైస్కూల్ కరస్పాండెంట్ కందుల శంకరయ్య తెలిపారు. పదో తరగతి విద్యార్థులకు ఈ టాలెంట్ టెస్ట్‌లు ఎంతో ఉపయోగపడతాయని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు పొనుకుల సుధాకర్ అన్నారు. చదువుతో పాటు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. సాయి చంద్ అత్యధికంగా 92మార్కులు సాధించాడనన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని హైస్కూల్ కరస్పాండెంట్ కందుల శంకరయ్య, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు భూక్య నాగభిక్షం, శ్రీనివాస్ లు తదితరులు అభినందించారు.

రవాణా మెరుగైతేనే అభివృద్ధి



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ లత

మధిర: రవాణా సౌకర్యం మెరుగైతేనే అభివృద్ధి సాధ్యమవుతుందని మధిర మున్సిపల్ చైర్ పర్సన్ మొండితోక లత అన్నారు. అమృత్ భారత్ స్టేషన్ కార్యక్రమంలో భాగంగా మధిర మండలం బయ్యారం గ్రామంలో నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జిని సోమవారం ఆమె ప్రారంభించారు. అనంతరం ఏడీఆర్‌ఎం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో చైర్ పర్సన్ మాట్లాడుతూ.. ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు, బీఆర్‌ఎస్ పార్టీ పార్లమెంటరీ ఫ్లోర్ లీడర్ నామా నాగేశ్వరరావు కృషితో బయ్యారం వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి మంజూరు అయిందన్నారు. అదేవిధంగా దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం 1,500 రైల్వే ఓవర్ బ్రిడ్జిలు, అప్రోచ్ రోడ్లు, రైల్వే అండర్ బ్రిడ్జిలు, రైల్వే అండర్ పాస్‌లు ప్రారంభించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ శీలం విద్యాలత, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడిని నివారించాలి



డీఎల్‌పీఓ ప్రభాకర్‌కు మొక్క అందజేస్తున్న అధికారులు

చింతకాని: రానున్న వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని డివిజనల్ పంచాయతీ అధికారి ప్రభాకర్ తెలిపారు. సోమవారం చింతకాని గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్నటువంటి బోర్లకు మరమ్మతులు చేయించాలన్నారు. ఈ సందర్భంగా పంచాయతీ సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించిన డీఎల్‌పీఓ ప్రభాకర్‌కు అధికారులు మొక్కను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామయ్య, మండల పంచాయతీ అధికారి రవీంద్ర ప్రసాద్, గ్రామ పంచాయతీ కార్యదర్శి సైదులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం ఖాళీ బిందెలతో ధర్నా

వేంసూరు: మంచినీళ్లు ఇవ్వండి మహాప్రభో అంటూ సీపీఐ సీపీఐ మహిళా సమైఖ్య ఎస్‌ఎఫ్‌ఐ డబ్ల్యూ ఆధ్వర్యంలో వేంసూరు తహసీల్ ఎదుట ధర్నా నిర్వహించారు. సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ హెచ్చరించారు. వేంసూరు పంచాయతీ పరిధిలోని డబుల్ బెడ్ రూమ్ వాసులకు మంచినీళ్లు లేక ఇబ్బంది పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, నీళ్లు కావాలంటే రెండు కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తుందన్నారు. అనంతరం తహసీల్దార్ రాజుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య మండల కార్యదర్శి ఎస్కే రంజాన్‌బీ, సీపీఐ మహిళా జిల్లా కౌన్సిల్ సభ్యురాలు రామలక్ష్మి, సీపీఐ వేంసూరు కార్యదర్శి లాల్‌సాహెబ్, మారయ్య, నారాయణరావు, రమణ, శ్రీలత, మాధవి, బాజి, కృష్ణకుమారి, మున్ని, రాజేశ్వరరావు, రామ్‌ప్రసాద్, వెంకటేశ్వరరావు, రాము, లక్ష్మి, వెంకటమ్మ, మాధవి తదితరులు పాల్గొన్నారు.



తహసీల్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు, మహిళలు

కమ్యూనికేటివ్ ఇంగ్లిష్‌పై సర్టిఫికెట్ కోర్సు



సర్టిఫికెట్ అందజేస్తున్న ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంగ్ల విభాగం టీఎస్‌కేసీ సంయుక్త ఆధ్వర్యాన కమ్యూనికేటివ్ ఇంగ్లిష్ కోర్సు అనే అంశంపై సర్టిఫికెట్ కోర్సును ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు భావ వ్యక్తీకరణ, నైపుణ్యాలను పెంపొందించుకునే విధంగా శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ రాంబాబు, డి.బంగారి, జి.వీరన్న, రామచంద్రరావు, సారంగపాణి, వినోద్‌కుమార్, మధు, డాక్టర్ ఎం.మాధవి, చెన్నారావు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

కుట్టు మిషన్లు వితరణ

కారేపల్లి: మండలంలోని మాధారంలో అమరురాలు తుమ్మలపల్లి శాంతమ్మ జ్ఞాపకార్థం, చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద మహిళలకు కుట్టు మిషన్లును పంపిణీ చేశారు. సోమవారం మాధారంలో జరిగిన తుమ్మలపల్లి శాంతమ్మ సంస్మరణ సభలో ఇల్లందు మున్సిపాల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వర్లు, ప్రముఖ కవి జయరాజ్, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి ప్రసాద్, మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు చంద్రశేఖర్, చేతుల మీదుగా మహిళలకు అందజేశారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

గోవిందాపురం(ఏ) గ్రామంలో..



శంకుస్థాపన చేస్తున్న ఎంపీటీసీ శ్రీదేవి, మాజీ సర్పంచ్ శ్రీనివాసరావు

బోనకల్: మండలంలోని గోవిందాపురం(ఏ) గ్రామంలో 7లక్షల నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్లకు సోమవారం ఎంపీటీసీ పారా శ్రీదేవి, మాజీ సర్పంచ్ భాగం శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. భట్టి విక్రమార్క మంజూరు చేసిన నిధులతో ఆళ్లపాడు నుంచి గోవిందాపురం మీదుగా ఆంధ్రా బోర్డర్ వరకు ఉన్న లింక్ రోడ్డుకు రూ. 2.90లక్షల నిధులను, గోవిందాపురం నుంచి మోటమర్రి వరకు రూ. 4.20లక్షల నిధులతో తార్‌రోడ్డు నిర్మించేందుకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు భాగం పాపారావు, భాగం నాగేశ్వరరావు, పరుశురాం, పారా వెంకటమోహన్ తదితరులు పాల్గొన్నారు.

అన్నారుగూడెంలో..



శంకుస్థాపన చేస్తున్న మాజీ సర్పంచ్ మమత

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెం గ్రామంలో సోమవారం సీసీరోడ్ల నిర్మాణానికి మాజీ సర్పంచ్ మారెళ్ల మమత శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా ఈ రోడ్లు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్నారుగూడెం సొసైటీ డైరెక్టర్ గోవింద్ శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ జోసఫ్, కాంగ్రెస్ నాయకులు రమేష్, వెంకటేశ్వర్లు, కృష్ణయ్య, శ్రీనివాసరావు, సురేష్, వెంకటేశ్వర్లు, రామారావు పాల్గొన్నారు.

సీతంపేట గ్రామంలో..



శంకుస్థాపన చేస్తున్న గ్రామ మాజీసర్పంచ్‌లు

చింతకాని: మండలంలోని సీతంపేట గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి గ్రామ మాజీసర్పంచ్‌లు ఆళ్ల రవీందర్, నారపోగు కొండలరావు సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొత్తపల్లి బస్వయ్య, జాల రమేష్, లక్ష్మీనర్సింహా, శ్రీను, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రుపాలెం మండలంలో..



ఎస్సీ కాలనీలో శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ శిరీష

ఎర్రుపాలెం: మండలంలోని కండ్రిక, నారాయణపురం, ఎర్రుపాలెం గ్రామాల్లో సోమవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నిధులు, ఈజీఎస్ నిధుల నుంచి మంజూరైన రూ.13లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్లుకు ఎంపీపీ దేవరకొండ శిరీష, ఎంపీడీఓ బి.సురేందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నాయకులు బండారు నర్సింహారావు, కడియం శ్రీనివాసరావు, మల్లెల లక్ష్మణరావు, వేజండ్ల సాయి, సామనూరి కృష్ణార్జున రాజు, దేవరకొండ వెంకటరత్నం, బుర్రా నారాయణ, బూసిపల్లి వెంకటరెడ్డి, గుడేటి బాబురావు, దేవరకొండ రాజీవ్‌గాంధీ, కంచర్ల వెంకటనర్సయ్య, దేవరకొండ శ్రీనివాసరావు, ఇస్మాయిల్, బొగ్గుల శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఎస్.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.